

సామాజిక స్ఫూర్తినిచ్చిన నాటికలు

వర్ధన్నపేట పట్టణంలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన నాటికలు సామాజిక స్ఫూర్తినిచ్చాయి.

- 8లో▸



విద్యుత్ సంస్థలను బలోపేతం చేయాలి

- 8లో▸

విద్యుత్ సంస్థలను బలోపేతం చేయాలని పీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య కోరారు.

గరిష్టం/కనిష్టం
37^0 /21^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మరింత పెరిగి ఉక్కపోత అధికమవుతుంది. రాత్రి పూట చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

6 నుంచి ఎల్‌ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 6వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 6, 11, 13, 15 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పరీక్షలు ఉంటాయన్నారు. అలాగే ఏడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 6వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. 6, 11, 13, 15, 18 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

20 నుంచి దూరవిద్య పీజీ సైన్స్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య కేంద్రం పీజీ సైన్స్ కోర్సుల మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 20వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. ఎమ్మెస్సీ బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ మొదటి ఏడాది పరీక్షలు ఈనెల 20, 22, 26, 28 తేదీల్లో నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



కమలాపూర్: ఎండాకాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ వి.శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. మండలంలోని అంబాల గ్రామాన్ని ఆదివారం ఆయన సందర్శించి తాగునీటి సరఫరా పరిస్థితిపై డీఈఈ శ్వేత, ఏఈ సుభాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వాటర్ మన్‌తో సమీక్షించారు. మండలంలోని మారుమూల గ్రామాలు, ఆవాసాలు, తండాలకు రోజు తాగునీరు సరఫరా చేయాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. పైపు లైన్లు పగిలినా, లీకైనా ఆలస్యం చేయకుండా వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే మండల స్థాయి మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అనంతరం తాగునీటి సరఫరాపై వారికి పలు సూచనలు చేశారు.

నవదిన ప్రార్థనలు ప్రారంభం



పతాకావిష్కరణ చేస్తున్న ఉడుముల బాల

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమా నగర్ కేథడ్రల్ చర్చి ప్రాంగణంలో ఆదివారం ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుముల బాల నవదిన జపముల్లో మొదటి రోజు పతాకావిష్కరణ చేసి ప్రార్థనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ ఈనెల 11, 12, 13 తేదీల్లో ఓరుగల్లు పీఠం 12 జిల్లాల విశ్వాసుల తిరునాళ్ల ఫాతిమా మాత మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని చెప్పారు. సోమవారం(నేడు) నుంచి ప్రార్థనలు ఉంటాయని, మహోత్సవాలకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల ఆంథోని హాజరవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం బిషప్ ఉడుములబాల కేథడ్రల్ చర్చిలో రాత్రి నవదిన పూజ ప్రార్థనలు చేశారు. ఫాదర్లు మర్రెడ్డి, అనుకిరణ్, ప్రకాష్, కరుణాకర్, కేథడ్రల్ చర్చి కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు అవార్డు



హన్మకొండ: ఉత్తమ సేవలు అందిస్తున్న విద్యుత్ ఉద్యోగులు.. సర్ సీవీ.రామన్ అవార్డు అందుకున్నారు. వివిధరంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారిని సీవీ.రామన్ అకాడమీ(సేవా సాంస్కృతిక సంస్థ)గుర్తించి అవార్డులు అందిస్తోంది. ఇందులో భాగంగా విద్యుత్ రంగం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న గొర్రెకుంట లైన్ ఇన్‌స్పెక్టర్ మచ్చిక బుచ్చయ్య గౌడ్,హనుమకొండ చౌరస్తా ఫోర్‌మెన్ కె.బాబు,వరంగల్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాస్,నర్సంపేట లైన్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్,ట్రాన్స్‌కో ఫోర్‌మెన్ ఎ.మురుగేషన్‌ను ఎంపిక చేయగా.. ఆదివారం హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డులు అందజేశారు.

పట్టుతప్పిన పాలన

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో సూపర్ వైజర్లదే హవా

- పాలకవర్గం లేక ఆరు నెలలు ఉద్యోగ ఖాళీలతో అదనపు బాధ్యతలు
- అస్తవ్యస్తంగా విధుల నిర్వహణ
- నాయక్ చేతుల్లో 'జీరో దందా'..గుట్టు?



వరంగల్ వ్యవసాయ మార్కెట్

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పాలన అస్తవ్యస్తంగా మారింది. యార్డుల్లో సూపర్ వైజర్లు చెప్పిందే వేదంగా మారడంతో పైఅధికారులు వస్తున్నా.. వారి ఆదేశాలు పాటిస్తున్న దాఖలాలు లేవు. మార్కెట్‌కు ఆరు నెలలుగా పాలకవర్గం లేకపోవడంతో గతంలో కార్యదర్శిగా పనిచేసిన అధికారి తీరుతో పాలన వ్యవహారాలు గాడితప్పాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.యార్డుల్లోని సూపర్‌వైజర్లు సదరు అధికారి కనుసన్నల్లోనే పనిచేయడం..అతను ప్రతీవిషయంవారితో చర్చించడం వల్లపైస్థాయి అధికారులంటే గౌరవం లేకుండా పోయిందన్న అభిప్రాయాలు వ్యక్తంఅవుతున్నాయి.

పట్టించుకోని పర్సన్ ఇన్‌చార్జ్..

పాలకవర్గం గడువు తీరడంతో మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా స్థానికంగా ఉన్న జేడీఎంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయన తన విధినిర్వహణలో బిజీగా ఉండడం వల్ల మార్కెట్ పాలన వ్యవహారంలో జోక్యం చేసుకోవడంలేదు. అప్పుడప్పుడూ మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తుండడంతో మార్కెట్‌లో కొంత మంది ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

కొనసాగుతున్న జీరో దందా..

మార్కెట్‌లో జీరో దందాను అరికట్టేందు కలెక్టర్.. జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించినా ఎలాంటి మార్పు రాలేదు. నాలుగు రోజుల క్రితం జీరోతో బయటకు వెళ్తున్న బస్తాలను పట్టుకోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మార్కెట్ కార్యదర్శిగా కొత్త అధికారి బాధ్యతలు చేపట్టినా ఆయన సర్వీసు మరో రెండు నెలలు మాత్రమే ఉండడంతో పాలనపై పెద్దగా దృష్టి పెట్టడంలేదని తెలుస్తోంది.

సూపర్‌వైజర్ల కనుసన్నల్లోనే..

మార్కెట్‌కు గ్రేడ్–1, 2 కార్యదర్శులు వచ్చినా సూపర్‌వైజర్ల కనుసన్నల్లోనే యార్డుల నిర్వహణ జరుగుతోంది. జీరో వ్యాపారం అరికట్టేందుకు యార్డుల్లో లాట్ ఐడీలు ఇచ్చిన తర్వాతే కాంటాలు వేయాలని కార్యదర్శులు ఆదేశాలు ఇచ్చినప్పటికీ రెండు గంటల పాటు అమలు చేస్తూ.. ఆ తర్వాత మళ్లీ ఎప్పటి మాదిరిగానే దందా సాగిస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన కార్యదర్శులు యార్డులను తనిఖీ చేసి ఐడీలు లేకుండా కాంటాలు వేస్తున్న మిర్చి బస్తాలను, కాంటాలను స్వాధీనం చేసుకున్నా తీరు మారడంలేదు.

ఖాళీలే కారణమా..!

మార్కెట్ యార్డుల్లో విధులు నిర్వహించే ఉద్యోగ ఖాళీలు సుమారు 25 వరకు ఉన్నాయి. ఇందులో అసిస్టెంట్ సెక్రెటరీ, ఏఎంఎస్(అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్), జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్, ఎల్‌డీసీ, గ్రేడర్ పోస్టులు ఉన్నాయి. వీటిని ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో యార్డుల్లో నిర్వహణ గాడితప్పింది. ప్రస్తుతం నెలకొన్న ఈ పరిస్థితులకు సూపర్‌వైజర్లు ఒకే మార్కెట్‌లో.. ఒకే చోట ఏళ్ల తరబడి విధులు నిర్వర్తించడమే కారణమని తెలుస్తోంది.

అంతా 'నాయక్' చేతుల్లోనే..

మార్కెట్‌లోని మిర్చి యార్డులో ఐదేళ్లకు పైబడి విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి 'నాయక్' చేతుల్లోనే జీరో దందా గుట్టు దాగిఉందనేది బహిరంగ రహస్యమే. సదరు ఉద్యోగి వేరే యార్డుకు బదిలీ అయినా అధికారులు అతడికి మిర్చియార్డులో అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. అడ్తిదారులు, ట్రేడర్లకు వారధిగా మార్కెట్ అధికారులు నాయక్‌ను వాడుకుంటున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అన్ని యార్డుల్లో సూపర్‌వైజర్లు మారినా నాయక్‌ను మాత్రం అక్కడే ఉంచడానికి ఇదే కారణమని సమాచారం.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

- వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న 'సిరిసిల్ల'

వరంగల్: ఐదేళ్లలోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. వరంగల్ దేశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలియో నిర్మూలనే లక్ష్యంగా చుక్కల మందు వేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మంగళవారం వరకు కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. అన్ని పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జీపీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది అప్పగించిన గ్రామాలు, వార్డుల్లోని ఇళ్లలో తిరుగుతూ చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, అదనపు డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ భరత్, జిల్లా మాస్ మీడియా అధికారి అనిల్, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

94.29 శాతం మందికి చుక్కల మందు

గీసుకొండ: వరంగల్ జిల్లాలో ఆదివారం చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. 0–5 ఏళ్ల లోపు పిల్లలు జిల్లాలో 75,277 మంది ఉండగా.. 70,982 (94.29 శాతం) మందికి చుక్కల మందు వేసినట్లు డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ తెలిపారు. తొలిరోజు పోలియో చుక్కలు వేసుకోని వారికి సోమ, మంగళ వారాల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి వేస్తారని పేర్కొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

హన్మకొండ అర్బన్: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి సహకరించాలని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యుడు సిరిసిల్ల రాజయ్య అన్నారు. జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ సహకారంతో నగరంలోని రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు 0–5 ఏళ్లలోపు పిల్లలకు పోలి యో చుక్కలు వేయించి మోడల్ కేంద్రంగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ.శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, ఎం.శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, బాశెట్టి హరిప్రసాద్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వి.వాణిశ్రీ, జిల్లా టీబీ అధికారి కె.హిమబిందు, ప్రోగ్రాం అధికారి ఉమాశ్రీ, శాశ్వత సభ్యులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో సకలశుభాలు

- కమలానంద భారతి తీర్థ స్వామి



అనుగ్రహభాషణం చేస్తున్న భారతి తీర్థ స్వామి

దామెర: శివనామస్మరణతో సకలశుభాలు కలుగుతాయని గన్నవరం కమలానంద భారతి తీర్థ స్వామి అన్నారు. స్థానిక దామేశ్వరాలయంలో ఆదివారం యంత్ర స్థాపన, శివలింగం, దేవతామూర్తులు, ధ్వజ స్తంభం, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకం కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులు, బిందెలతో నీరు తీసుకుని వచ్చి దేవతామూర్తులు, నందీశ్వరుని అభిషేకించి శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి భారతి తీర్థ స్వామి హాజరై పూజల అనంతరం అనుగ్రహభాషణం చేశారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. దైవానుగ్రహం ఉంటే తలపెట్టిన ప్రతీ పని విజయవంతమవుతుందని చెప్పారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. శివాలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రెడ్ క్రాస్ చైర్మన్ విజయ్ చందర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది ముద్దసాని సహోదర్‌రెడ్డి, డాక్టర్ శ్రీరాంరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మోకిళ్ల సత్యనారాయణ, శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి, భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకులు శేషుశర్మ, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూల్యాంకనం

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. నేటి నుంచి సంస్కృతం సబ్జెక్టుకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జవాబపత్రాల మూల్యాంకనం క్యాంపుగా హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. సంస్కృతం సబ్జెక్టు పరీక్షకు సంబంధించిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తం 60వేల జవాబపత్రాలు వచ్చాయి. 72 మంది సంస్కృతం సబ్జెక్టుకు చెందిన ఉపాధ్యాయులు ఏఈలుగా మూల్యాంకనం చేయబోతున్నారు.

ఆకట్టుకున్న డాగ్ షో

- 35 జాతుల శునకాల ప్రదర్శన



ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్న న్యాయ నిర్ణేతలు



డాగ్స్‌తో ప్రదర్శన ఇస్తున్న యజమానులు

హన్మకొండ: హనుమకొండ సెయింట్ పీటర్స్ పబ్లిక్‌స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన డాగ్ షో నగరవాసులను ఆకట్టుకుంది. 35 జాతులకు చెందిన వివిధ రకాల శునకాలు ప్రదర్శనలో పాల్గొనగా వాటిని చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. కాకతీయ కెన్నల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి డాగ్ షోను న్యాయ నిర్ణేతలు సంజిత్‌కుమార్ మాంటే, గౌరి నాల్గోకర్ ప్రారంభించారు. అనంతరం వారు శునకాల ఫిట్‌నెస్‌ను పరిశీలించి విజేతలను ప్రకటించారు. హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఆయా ప్రాంతాల నుంచి యజమానులు తమ శునకాలతో చేరుకుని ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు కె.రామస్వామి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రదీప్ రెడ్డి, జాయింట్ సెక్రటరి కె.ప్రవీణ్ కుమార్, కోశాధికారి ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

'నల్లెల' కృషి ఎనలేనిది

- సంతాప సభలో వక్తలు



నివాళులర్పిస్తున్న సంఘాల బాధ్యులు

విద్యారణ్యపురి: తెలంగాణ ఉద్యమకారుడిగా, పర్యావరణ ప్రేమికుడిగా, పౌరస్పందన వేదిక బాధ్యుడిగా, దివ్యాంగుల హక్కుల నాయకుడిగా నల్లెల రాజయ్య చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో దివ్యాంగ, ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి వరంగల్ ఆధ్వర్యంలో రాజయ్య సంతాప సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. సమాజంలో జరిగిన ప్రతి పోరాటం.. ఉద్యమంలో మమేకమైన రాజయ్య ఒక శక్తిగా నిలిచారని పేర్కొన్నారు. వరంగల్ రచయితల సంఘం ఏర్పాటుచేసి ఆ సంస్థ ద్వారా అనేక పోరాటాలు నడిపించడంతో పాటు సాహిత్యంలో 20కి పైగా సంకలనాలు తీసుకొచ్చి ప్రజలకు, ఉద్యమకారులకు చేరవేసి చైతన్యాన్ని నింపారని అన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా మూలాలను తెలుసుకొని వెంటనే కార్యచరణ సిద్ధం చేసే నైపుణ్యం రాజయ్యకే సొంతమని చెప్పారు. తొలుత రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యాఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్లమహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పౌరస్పందన వేదిక బాధ్యులు ఎస్‌కే.హబీబ్‌మియా, లక్ష్మయ్య, బొనగిరి రాములు, డాక్టర్ లక్కిరెడ్డి సత్యం, శంకర్‌నాయక్, తిరుపతి, డాక్టర్ శ్యామల, కవులు, రచయితలు పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు, అనిశెట్టి రజిత, రామలక్ష్మి, డీడబ్లూఓ కె.మధురిమ, మెప్మా ఎండీ అంబటి రాజేందర్, జోగు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కారులో కల్లోలం

జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ పార్టీ మారుతున్నట్లు ప్రచారం

- ఎందులోకి వెళ్లాలని.. అనుచరులతో మంతనాలు
- ఇప్పటికే వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ కాంగ్రెస్‌లో చేరిక
- తూర్పు నియోజకవర్గం కార్పొరేటర్ల చూపు 'హస్తం' వైపు
- మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళితో భేటీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో నేడు పార్టీలో చేరుతారని చర్చ



సాక్షి, వరంగల్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వరంగల్ బీఆర్‌ఎస్‌లో ప్రకంపనలు మొదలయ్యాయి. జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ గులాబీ పార్టీని వీడుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎందులోకి వెళ్లాలని తన అనుచరులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. మొన్నటివరకు ఆయన ఎమ్మెల్యేగా ఉండి గెలిపించుకున్న వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మరో ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో రాజకీయం హీట్ పుట్టిస్తోంది. ఇంకోవైపు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 13 మంది జీడబ్ల్యూఎంసీ కార్పొరేటర్లు మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళితో జరిపిన సంప్రదింపులు ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని తెలుస్తోంది. వీరితోపాటు మరికొందరు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు సైతం హస్తం పార్టీలో చేరే అవకాశముంది. ఇలా ముఖ్యనేతలు పార్టీ మారుతుండడంతో గులాబీ పార్టీలో గుబులు మొదలైంది.

అరూరి ఎటువైపు..

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్‌గా ఉంది. ఇక్కడి నుంచి బీఆర్‌ఎస్ తరఫున సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, అరూరి రమేష్, కడియం కావ్య పేర్లు అభ్యర్థులుగా ప్రచారంలో ఉన్నాయి. పార్టీ మారుతున్నారనే ప్రచారాన్ని అరూరి రమేష్ పలు దఫాలు ఖండించారు. మాజీ సీఎం కేసీఆర్ వెన్నంటే ఉండి బీఆర్‌ఎస్ బలోపేతానికి కష్టపడి పనిచేస్తానని, పార్టీ మారుతున్నాననే వదంతులను నమ్మవద్దని ఖండించిన సందర్భాలున్నాయి. రాష్ట్రంలో ఎలాగైనా బలం పెంచుకోవాలని చూస్తున్న బీజేపీ మాత్రం ఆర్థిక, అంగబలం ఉన్న నేత అరూరిని రంగంలోకి దింపాలని ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపినట్లు రాజకీయవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎవరు ఊహించని విధంగా జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలోకి చేరినట్లుగానే అరూరి కూడా చేరే అవకాశాలు లేకపోలేదన్న చర్చ జోరుగా సాగుతోంది. కాంగ్రెస్‌కు కూడా ఇక్కడి నుంచి బలమైన నేత లేకపోవడంతో అరూరికి అటువైపు కూడా తలుపులు తెరిచే ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. అరూరి రమేష్ మాత్రం ఎక్కడా పార్టీ మారుతానని బహిరంగంగా మాత్రం ప్రకటించలేదు. ఇంకోవైపు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అరూరి రమేష్ పార్టీ వీడకుండా చూసే బాధ్యతను బీఆర్‌ఎస్ అధిష్టానం అప్పగించిందని సమాచారం.

గ్రేటర్‌లో బీఆర్‌ఎస్‌కు దెబ్బే..

2021 ఏప్రిల్ 30న జరిగిన గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జయకేతనం ఎగురవేసింది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 46, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 9 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఒకవేళ అవిశ్వాసం కోసం తీర్మానం పెడితే 38 మంది మెజార్టీ సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేస్తే నెగ్గుతుంది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఉన్న 11 మంది కార్పొరేటర్లతోపాటు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఓటు హక్కు ఉంది. దీంతో ఆ సంఖ్య 15కు చేరనుంది. మరో 13 మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరితే ఈ సంఖ్య 28కి చేరుతుంది. అయినా ఇప్పటికిప్పుడు బీఆర్‌ఎస్‌కు ముప్పేమీ లేదు. మరో 10 మంది కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌తో చేతులు కలిపితే మాత్రం అవిశ్వాసం నెగ్గి బీఆర్‌ఎస్‌కు ఉన్న మేయర్ పదవి చేజారే అవకాశముంది. కాగా, తాజాగా 13 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకోనుండడంతో మాత్రం బీఆర్‌ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల వేళ ఎదురుదెబ్బేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎలాగైనా వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని గెలుచుకునేందుకు వ్యూహాలు రచిస్తున్న కాంగ్రెస్‌తో బీఆర్‌ఎస్‌కు గడ్డు పరిస్థితులు ఎదురుకానున్నాయి.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం వరకు రాతపూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

విజయ హత్య కేసు విచారణ వేగవంతం

కాజీపేట: రహమత్‌నగర్ కాలనీలో డిసెంబర్ 14న జరిగిన వృద్ధురాలు కన్నె విజయ హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు మరోమారు రంగంలోకి దిగారు. ఘటన జరిగి రెండున్నర నెలలు కావొస్తున్నా హత్య చేసిన నిందితుల ఆధారం మాత్రం దొరకలేదు. నిందితులను గుర్తించాలంటూ కింది స్థాయి సిబ్బందిపై జిల్లా అధికారులు ఒత్తిడి పెంచుతున్నారు. ఇటీవల పరిపాలన సౌలభ్యం కోసం సీఐ, ఏసీపీలు వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో బదిలీపై వచ్చిన ఏసీపీ తిరుమల్, సీఐ సుధాకర్‌రెడ్డి ఆదివారం రహమత్‌నగర్ కాలనీతో పాటు ప్రధాన రహదారులపై ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. హత్య జరిగిన రోజు కాలనీకి వచ్చిపోయిన వాహనాలు వాటి యజమానుల జాబితాతో పాటు అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నా.. చిన్న క్లూ కూడా దొరకని పరిస్థితి. మృతురాలి కుటుంబ సభ్యులను పలుమార్లు అదుపులోకి తీసుకుని విచారించినా ఫలితం లేదు. రహమత్‌నగర్ కాలనీలో విజయ మృతదేహం వెలుగు చూసిన ప్రాంతాన్ని సందర్శించి వివరాలు రాబడుతున్నారు. నిందితులు పోలీసులకు పట్టుబడకపోవడం కాజీపేట పట్టణంలో చర్చనీయంశంగా మారిన నేపథ్యంలో పోలీస్ అధికారులు వివిధ కోణాల్లో విచారణ వేగవంతం చేశారు.

గ్రామీణ తపాలా ఉద్యోగులకు భద్రత కల్పించాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగులకు భద్రత కల్పించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ దివ్యదీప్తి భవన్‌లో ఆదివారం రెండవ రోజు కొనసాగిన ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ద్వైవార్షిక జాతీయ మహాసభల్లో ఆయన మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు కనీస వైద్య సదుపాయం, ప్రమాద బీమా, ఇంక్రిమెంట్లు, ఉద్యోగ భద్రత లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేయించుకుంటూ వారిని గుర్తించకపోవడం అన్యాయమన్నారు. ప్రముఖ పేరిణి నృత్య కళాకారుడు రంజిత్ బృందం ప్రదర్శించిన పేరిణి నృత్యం, తాడూరి రేణుక శిష్య బృందం స్వాగత నృత్యం అలరించాయి. ప్రముఖ రచయిత గాయకుడు టి.మురళీమధు దొర రచించి పాడిన గ్రామీణ ఉద్యోగుల పాటల సీడీని సదస్సులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ర యాదవరెడ్డి, కాయిత ఇంద్రసేనారెడ్డి, డి.జనార్దన్, జాతీయ మహాసభల ప్రధాన కార్యదర్శి బొద్దుల వెంకటేశ్వర్లు, కోశాధికారి మర్రి కొమురారెడ్డి, రైల్వే నాయకుడు కుర్సపెల్లి రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామీణ తపాలా ఉద్యోగ సంఘాలు విలీనమయ్యాయి.

సీఎంను కలిసిన వరంగల్ మేయర్ సుధారాణి



ముఖ్యమంత్రి రేవంత్ రెడికి పూల మొక్క అందజేస్తున్న వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరారు. మేయర్‌తో ఆమె కుమారుడు విజయ్‌రాజ్ ఉన్నారు. ఇదిలా ఉండగా.. మేయర్ సుధారాణితో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు సుమారు 13 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


బొమ్మకంటి వంశీ

దామెర : ల్యాదెళ్లకు చెందిన యువకుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెళ్లకు చెందిన యువకుడు బొమ్మకంటి వంశీ చిన్నతనం నుంచి మతిస్థిమితం సరిగా లేకుండా చుట్టు పక్కల గ్రామాల్లో తిరుగుతుండే వాడు. పొద్దంతా ఎక్కడికి వెళ్లినా రాత్రికి ఇంటికి చేరుకునేవాడు. కాగా ఫిబ్రవరి 27న ఇంటి నుంచి బయటికి వెళ్లిన వంశీ తిరిగి రాలేదు. దీంతో వంశీ తండ్రి పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వంశీ చామనఛాయ రంగు కలిగి, కోల ముఖం, 5 ఫీట్ల ఎత్తు ఉంటాడన్నారు. నీలిరంగు ప్యాంట్, ముదురు నీలి రంగు షర్ట్ వేసుకుని ఉన్నట్లు వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు 87126 85020, 87126 85228 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అరవింద్‌రెడ్డి (ఫైల్)

నెక్కొండ : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన రావుల అరవింద్‌రెడ్డి (20) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అరవింద్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో అరవింద్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తండ్రి మధుకర్ రెడ్డి, తల్లి రజిత, చెల్లి హర్షిత ఉన్నారు. అరవింద్‌రెడ్డి మృతితో నెక్కొండలో విషాదఛాయలు అలుముకున్నాయి.


రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన డీసీఎంలు

మహదేవపూర్ : అక్రమంగా తరలిస్తున్న 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్థానిక యువకులు ఆదివారం మండల కేంద్రంలో పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ కరీంనగర్‌లోని సుమంగళి ట్రేడర్స్ నుంచి మహారాష్ట్రలోని జానకి ట్రేడర్స్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని కాటారంలోని అన్నపూర్ణ రైస్ మిల్లులో భద్రపరుస్తామన్నారు. డీసీఎం డ్రైవర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా, యువత.. రేషన్ బియ్యం అక్రమ రవాణపై తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

కడుపు 'ఉబ్బరం'తో కలవరం

- పశువులకు సోకుతున్న అరుదైన వ్యాధి
- ఆందోళనలో పాడి యజమానులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు



కరీమాబాద్ : పశువుల్లో కడుపు 'ఉబ్బరం' వ్యాధి కలవరపెడుతోంది. పశువులకు సోకుతున్న వ్యాధితో యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. సాధారణంగా పశువులకు కొన్ని సీజనల్ వ్యాధులు వస్తాయి. అయితే కడుపు ఉబ్బరం వ్యాధి మాత్రం పాడి పశువులలో అరుదుగా కనిపిస్తుంది. దీనిపై జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించి ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని చెబుతున్నారు.

వ్యాధి రెండు రకాలు..

పశువులకు సోకుతున్న కడుపు ఉబ్బరం(బ్లోట్) వ్యాధి రెండు రకాలు ఉంటుంది. వాటిలో ఒకటి ప్రైమరీ బ్లోట్, రెండో ఫ్రోతీబ్లోట్. ఈ వ్యాధులు ఎక్కువగా మేతకు సంబంధించిన కారణాలతోనే వస్తుంటాయి.

మేతకు సంబంధించి..

చెట్ల ఆకులు, గడ్డిని ఎక్కువగా తినిపించడం, లెగ్యూమ్ జాతి గడ్డి రకాలను ఎక్కువగా మేపడం, రెడ్‌క్లోవర్, అల్ఫా వంటి గడ్డి జాతులను ఎక్కువగా మేపడం, యూరియా చల్లిన ధాన్యపు జాతి గడ్డి రకాలను మేపడం, ఉడకబెట్టిన అన్నం అధికంగా తినిపించడం ద్వారా కూడా ఈ వ్యాధి సోకుతుంది. ఇక ఫ్రోతీ బ్లోట్ సోకేందుకు పచ్చిగడ్డిలో ఉండే సైటోప్లాస్మిక్ ప్రోటీన్ల మూలంగా నిరంతరం కడుపు(రూమెన్)లో నురగ తయారవుతుంది. అధిక కాల్షియం, తక్కువ ఫాస్పరస్ గల గడ్డి రకాలు, హిస్టమిన్, హైడ్రోజన్ సల్ఫైడ్ అధికంగా ఉండే లెగ్యూమ్ జాతి గడ్డి రకాలను ఎక్కువగా మేపడంతో కడుపులో నురగ తయారవుతుంది.


కడుపు ఉబ్బిన ఆవు

వ్యాధి క్రమం..

పశువుల కడుపు, రెటిక్యులంలో అధికంగా గాలి తయారవడం లేదా తయారైన గాలి బయటకు వెళ్లక పోవడం మూలంగా కడుపులో గాలి శాతం పెరిగి ఉబ్బుతాయి. ఫలితంగా విభాజక పటలంపై ఒత్తిడి పెరిగి ఊపిరితిత్తులలో హైపాక్సియం స్థితి ఏర్పడి పశువులు మృత్యువాత పడొచ్చు. గుండెలో టాకికార్డియా ఏర్పడి నాడి రేటు పెరిగి కొన్ని సందర్భాల్లో పశువుల గుండె ఆగి మృత్యువాత పడొచ్చు.

వ్యాధి లక్షణాలు..

పశువుల్లో కడుపు గాలితో నిండి ఉంటుంది. ఫలితంగా చేతివేళ్లతో తట్టినప్పుడు డ్రమ్ లాంటి శబ్ధం వినిపిస్తుంది. నోటి నుంచి చొంగ కారుతుంది. నాలుక బయటకు పెట్టి పళ్లు కొరకడం, తల పై కెత్తి శ్వాస కష్టంగా తీసుకోవడం, పదే పదే పొట్టను చూస్తూ కాళ్లతో తన్నుకోవడం, విరేచనాలవుతాయి. ఆకలి మందగించి పశువులు నీరసంగా ఉంటాయి. శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది.

వ్యాధి నివారణకు...

ఉబ్బరం తగ్గే వరకు పశువులకు ఎలాంటి ఆహారం, నీరు పెట్టొద్దు. పశువుల ముందు భాగం(తల వైపు భాగం) ఎత్తుగాను, వెనక భాగం పల్లంగా ఉండేలా చూడాలి. చార్కోల్ గానీ చెక్కముక్క గానీ నోట్లో పెడితే లాలాజలం ఉత్పత్తి పెరిగి కడుపులో నురగతో కూడిన గాలి తగ్గుతుంది.

పశువులకు చికిత్స...

సోడియం బైకార్బొనేట్‌ను తగిన మోతాదులో నీటిలో కలిపి తాగించాలి. వేరుశనగ, నువ్వుల నూనె 500 ఎంఎల్ నుంచి లీటర్ వరకు తాగించొచ్చు. బ్లోటోసిల్, బ్లోటోనిల్, టింపానిల్ లాంటి ద్రావణాలను 80-90 ఎంఎల్ వరకు తాగిస్తే ఫలితం ఉంటుంది. పశువులు త్వరగా కోలుకునేందుకు సెలైన్‌ను ఎక్కించడంతోపాటు మల్టీ విటమిన్లు, మినరల్ కలిగిన ఇంజక్షన్లు ఇస్తే పశువులకు ఎంతో ఉపయోగం ఉంటుంది.

పశువులను గమనిస్తుండాలి



పశువుల మేత విధానాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. కడుపు ఉబ్బరం ఉన్నప్పుడు చొంగ కారడం, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. కడుపు ఉబ్బినట్టు కనిపించగానే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువులకు చికిత్స అందించిన తర్వాత అవి వెంటనే మేత మేయలేవు. అందుకే సెలైన్ బాటిల్స్ ఎక్కించాలి. మల్టీవిటమిన్ ఇంజక్షన్లు వేయించాలి.

-డాక్టర్ శశాంక్, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు


రైతుపై పగ.. పశువులను చంపిన దుండగులు

- నీటి తొట్టిలో యూరియా కలిపిన వైనం
- ఆ నీటిని తాగిన మూడు మూగజీవాలు మృత్యువాత

రఘునాథపల్లి : రైతు మీద పగతో పశువుల ప్రాణం తీశారు. నీటి తొట్టిలో యూరియా కలపడంతో అందులోని నీటిని తాగిన రెండు ఆవులు, ఒక కోడె మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన ఆదివారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గిద్దబండతండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన బానోత్ తిరుపతి ఇటీవల వరి పంటకు యూరియా చల్లగా.. మిగిలిన సగం బస్తా యూరియా పశువుల పాకలో నిల్వచేశాడు. శనివారం తన రెండు ఆవులు, ఒక కోడెను పశువుల పాకలో కట్టేసి ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న దుండగులు పాకలో ఉన్న యూరియాను నీటి తొట్టిలో కలిపా రు. సాయంత్రం తిరుపతి భార్య సునీత పాకలో ఉన్న పశువులను వదలడంతో అవి తొట్టిలోని నీళ్లు తాగాయి. రాత్రి సమయంలో ఓ ఆవు ప్రాణం వదలగా, మిగతా రెండు ఆదివారం ఉదయం మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనపై పశువైద్యుడిని తీసుకురాగా విష ప్రయోగం జరిగినట్లు నిర్ధారించారు. పాకలో ఉన్న యూరియా కనిపించకపోవడంతో నీటి తొట్టిని పరిశీలించారు. అడుగు భాగంలో యూరియా ఆనవాళ్లు ఉండడంతో గిట్టని వారు చేసిన పనిగా బాధితులు కన్నీరు మున్నీరవుతున్నా రు. కాగా, మృత్యువాత పడిన పశువుల విలువ రూ.లక్షా పదివేలు ఉంటుందని బాధితులు తెలిపారు.


విషపు నీరు తాగి మృత్యువాత పడిన ఆవులు

మేడారం హుండీ ఆదాయం రూ.71 లక్షలు


భక్తురాలు పేపర్‌పై రాసిన కోరిక

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర హుండీ లెక్కింపు నాలుగో రోజు ఆదివారం కొనసాగింది. 88 ఐరన్ హుండీలు విప్పి కానుకలు లెక్కించగా రూ.71,67,000 ఆదాయం లభించింది. గడిచిన మూడు రోజులు నిర్వహించిన లెక్కింపులో రూ.9,60,36,000 వచ్చాయి. నాలుగో రోజుతో కలుపుకుని 405 హుండీల్లో రూ.10,32,03,000 ఆదాయం సమోదైంది. ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేశామని మేడారం ఈఓ రాజేంద్రం తెలిపారు. ఇదిలా ఉండగా ఓ భక్తురాలు.. మా ఆయన బెట్టింగ్ మానేయాలి.. మా అక్క కొడుక్కి ఐఐటీలో సీట్ రావాలి అని రాసిన పేపర్ హుండీలో లభించింది.

కిరాణషాపు దగ్ధం

మహదేవపూర్ : మండలంలోని బొమ్మాపూర్ ఎస్సీ కాలనీకి చెందిన మేకల వెంకటి కిరాణషాపు ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. షాపులోని ఫ్రిజ్, బీరువా, ఫర్నిచర్ ఇతర వస్తువులతో పాటు కిరాణసామగ్రి మొత్తం కాలిపోయిందని విలపించాడు. దాదాపు రూ.1,50,000 వరకు నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని రోదించాడు.

సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

- సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ కె.తిరుమల్‌రావు

హన్మకొండ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చైర్మన్ కె.తిరుమల్‌రావు తెలిపారు. ఈ నెల 6న జనగామ డివిజన్ రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో నర్మెట, ఖిలాషాపూర్, రఘునాథపల్లి, తరిగొప్పుల సెక్షన్ పరిధి వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. 7న హనుమకొండ రూరల్ డివిజన్ ధర్మసాగర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టుకు ఐనవోలు, ధర్మసాగర్, పంథిని, 13న హుజురాబాద్ డివిజన్ జమ్మికుంట సబ్‌డివిజన్ పరిధి తనుగుల సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టుకు చల్లూరు, జమ్మికుంటరూరల్, జమ్మికుంట రూరల్ వెస్ట్, జమ్మికుంట టౌన్, తనుగుల, వీణవంక, 19న భూపాలపల్లి డివిజన్ కాటారం సబ్‌డివిజన్ పరిధి మహాముత్తారం సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో కాటారం, కొయ్యూరు, మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల సెక్షన్ పరిధి వినియోగదారులు ఫిర్యాదులు అందజేయాలని సూచించారు. ఈ లోకల్ కోర్టులు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సామాజిక స్ఫూర్తినిచ్చిన నాటికలు

వర్ధన్నపేట : భారతీయ నాటక కళాసమితి స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి నాటికల ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి 10 గంటలకు మొదట తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి 'నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత?' అనే నాటికను ప్రదర్శించారు. ఇందులో ఇతివృత్తం ఇలా ఉంది. ఓ విప్లవ రచయిత కుమారుడు కుమార్. విప్లవ భావాలున్న ఆ తండ్రి తన కుమారుడు కుమార్‌కు మరో రచయిత కూతురితో ఆదర్శ వివాహం చేస్తాడు. కానీ ఆమె అతడితో ఇమడలేకపోతోంది. కుమార్ తన తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడం ఆమె భరించలేకపోతోంది. తన కూతుర్ని తీసుకెళ్లిపోతోంది. మరొకరితో అక్రమ సంబంధం ఏర్పరుచుకుంటుంది. అది ప్రశ్నించిన కుమార్‌పై పోలీసు కేసు పెడుతుంది. దీంతో న్యాయస్థానం ద్వారా ఆమెకు మనోవర్తి వస్తుంది. ఈ నిజం తెలిసినా పోలీసులు చట్ట ప్రకారం తాము ఏమి చేయలేమని అంటారు. చివరకు కుమార్ తన కూతురును ఇవ్వాలని భార్యను వేడుకుంటాడు. అయితే పాపను ఇవ్వను సరి కదా.. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందని పాపని అంతమొందిస్తారు. దీంతో అలసిపోయిన కుమార్ కన్నెర్ర చేస్తాడు. సామాన్యుడు అసామాన్యుడవుతాడు. చట్టమే స్వేచ్ఛను ఇస్తే ఇక వీటిని ఆపేదెవరు... ఈ సమాజం ఎటుపోతుంది. మేధావుల నిశ్శబ్దం జాతికి ప్రమాదమని.. ఈ ప్రశ్నల నుంచే ఉద్భవించిందే 'నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత' నాటిక. నటీనటుల హావాభావాలు అందరినీ ఆకట్టుకుంది. అలాగే, రాత్రి 11 గంటలకు కళానికేతన్, వీరన్నపాలెం వారి 'రాజుగారి గోచి' అనే నాటికను రెండో ప్రదర్శనగా వేశారు.


నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత? నాటికలోని ఓ సన్నివేశం

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

- ప్రొఫెసర్ వెంకటనారాయణ

న్యూశాయంపేట: ప్రజాస్వామ్య పరిరక్షణకు పౌరసంఘాలు ఐక్యంగా ఉండి పోరాడాలని ప్రొఫెసర్ వెంకటనారాయణ అన్నారు. ఆదివారం హనుమకొండ ములుగురోడ్డులోని ఓ సమావేశ మందిరంలో డాక్టర్ రాజ్‌మహ్మద్, ముజాహిద్ ఇర్ఫాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్న బీజేపీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌తోపాటు వివిధ పౌరసంఘాల బాధ్యులు ప్రసంగించారు. అనంతరం ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రొఫెసర్ వీరన్న నాయక్, ఉపాధ్యక్షులుగా సోమ రాంమూర్తి, కె.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రాజ్‌మహ్మద్, జాయింట్ సెక్రటరీలుగా చలపతి, కుమారస్వామి, మీడియా ఇన్‌చార్జ్‌గా ఎ.నగేశ్, కోశాధికారిగా ఉదయ్‌సింగ్, అడ్వైజరీలుగా ప్రొఫెసర్ వెంకట్‌నారాయణ, ఎర్రగట్టు స్వామి, ఓంబ్రహ్మం, సాంబయ్య, స్వామిని ఎన్నుకున్నారు. సమావేశంలో జిలుకర శ్రీనివాస్, అజీజ్, అలీమ్, తౌఫిఖ్, నదీమ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వివిధ పౌరసంఘాల నేతలు

విద్యుత్ సంస్థల బలోపేతానికి కృషి చేయాలి

- తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య

హన్మకొండ : విద్యుత్ సంస్థల బలోపేతానికి పవర్ ఇంజనీర్లు, ఉద్యోగులు కృషి చేయాలని తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేగ సమ్మయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలో అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలు ఆర్థికంగా బలోపేతం కావాల్సిన అవసరముందని, ఈ దిశగా ఉద్యోగులు తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా అసోసియేషన్‌ను బలోపేతం చేయాలన్నారు. పవర్ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. నాయకత్వం ఎల్లప్పుడు సభ్యులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలు అందిస్తోందన్నారు. సభ్యులకు ఏమైనా ఇబ్బందులుంటే అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా 2024-క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, చీఫ్ అడ్వయిజర్ వరప్రసాద్, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రధాన కార్యదర్శి వంగ రవీందర్, అధ్యక్షుడు ఆర్.పాండు, అడిషనల్ సెక్రటరీ బి.సుధాకర్, జిల్లాల కార్యదర్శులు, ఏఈలు, సబ్ ఇంజనీర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

డీసీఎం, లారీ ఢీ

- 11 మంది కూలీలకు గాయాలు
- పెగడపల్లి క్రాస్ వద్ద ఘటన

హసన్‌పర్తి: డీసీఎం,లారీ ఢీకొన్న ఘటనలో 11 మంది కూలీలు గాయపడ్డారు. ఈఘటన ఆదివారం ఆరెపల్లి–యాదాద్రి జాతీయ రహదారి మధ్యలోని పెగడపల్లి క్రాస్ వద్ద చోటుచేసుకుంది. పెగడపల్లికి చెందిన 11 మంది కూలీలు మిర్చి ఏరడానికి డీసీఎంలో నడికూడకు బయలుదేరారు.అయితే వీరి వాహనం పెగడపల్లి క్రాస్ వద్దకు చేరుకుంది. ఆరెపల్లి వైపు నుంచి బయలుదేరిన లారీ పెగడపల్లి క్రాస్ యూ–టర్న్ తీసుకునే ఈక్రమంలో అదుపు తప్పి డీసీఎంను ఢీకొంది. ఈప్రమాదంలో డీసీఎంలో ప్రయాణిస్తున్న పెగడపల్లికి చెందిన నేనిటి పుష్ప, వేల్పుల రాజమ్మ, రాధక్క, నన్నబోయిన ఐలమ్మ, మ్యాదరబోయిన రాజమ్మ,గండు ఎల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా, డీసీఎం–లారీ ఢీకొన్న ప్రమాదంలో కూలీలు గాయపడిన విషయాన్ని పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కమలాకర్ స్థానిక ఎమ్మెల్యే నాగరాజుకు సమాచారం అందించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఎంజీఎం ఆర్‌ఎంతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.


గాయపడిన కూలీలు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


రవీందర్(ఫైల్)

దుగ్గొండి : ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలం మహ్మదాపురంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాలడుగుల రవీందర్(52) కొన్నేళ్లుగా ఫర్టిలైజర్ షాపు నడుపుతున్నాడు. నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చేందుకు షాపుతో సహా ఇంటిని విక్రయించినా అప్పు తీరలేదు. భూమి అమ్మి అప్పులు తీర్చుదామని చూడగా అప్పటికే భూమిని రవీందర్ తల్లిదండ్రులు కూతుళ్లకు రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రవీందర్ శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా రవీందర్ అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు.

భార్య మందలించిందని వలస కూలీ..


కలకాను పుటేల్ మృతదేహం

సంగెం : భార్య మందలించిందని వలసకూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బలంగిర్ జిల్లా పాట్నాగర్ మండలం బూచేపల్లికి చెందిన కలకాను పుటేల్(62) భార్యా పిల్లలతో కలిసి సంగెం మండలం ఆశాలపల్లి శివారులో ఇటుకల తయారీ పనికోసం డిసెంబర్‌లో వలస వచ్చారు. ఈనెల 2న యజమాని కూలి డబ్బులు ఇవ్వగా మద్యం తాగి ఖర్చు చేశాడు. వచ్చిన డబ్బులు తాగుడుకు ఖర్చు చేస్తే బతకడం ఎట్లా అని భార్య జమున పుటేల్‌ను మందలించింది. ఈ క్రమంలో పుటేల్ ఆదివారం తెల్లవారు జామున బయటికి వెళ్లి రాలేదు. చుట్టుపక్కల వెతకగా ఇటుకల బట్టీల పక్కన చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కుమారుడు ఉమాకాంత్ ఉరితాడు విప్పి చూడగా కొనఊపిరి ఉండడంతో యాజమాని బుచ్చయ్య చౌదరి కారులో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

పేదింటి బిడ్డకు పెద్దకష్టం

- ఆరోగ్యం క్షీణిస్తోంది ఆదుకోండి
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న సతీశ్
- ఆపరేషన్ చేయించుకోలేని దుస్థితి
- సాయమందించి ప్రాణాలు నిలపాలని వేడుకోలు


దీన గాథ

పాలకుర్తిటౌన్: రంగురంగుల బొమ్మలాటల మధ్య జీవితం గడిపేవాడు. తన కుటుంబానికి తానే హీరో అనుకునే వాడు. తనను నమ్ముకున్న వాళ్లను ఉన్నతస్థానంలో నిలబెట్టాలని కలలు కనేవాడు. భార్యా పిల్లలతో జీవితం సాఫీగా సాగిపోతుందనుకున్న సమయంలో విధి వెక్కిరించింది. అరుదైన వ్యాధి కారణంగా అతడు మంచానికే పరిమితమయ్యాడు. అతడిని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడింది. చికిత్స చేయించే స్తోమత లేక ఆపన్నహస్తం కోసం ఇప్పుడా కుటుంబం ఎదురు చూస్తోంది.

అరుదైన వ్యాధి..

జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామానికి చెందిన 34 ఏళ్ల జిలుకర సతీశ్ సినిమా థియేటర్లో పని చేసేవాడు. వచ్చిన మొత్తంతో కుటుంబాన్ని పోషించేవాడు. అతడికి భార్య విజిత, ఇద్దరు కుమారులు లోకేశ్, ధన్విక్. తండ్రి మరణించడంతో తల్లికి తోడుగా నిలిచి కాయాకష్టం చేసి సోదరి మౌనిక వివాహం దగ్గరుండి జరిపించాడు. బాధ్యతలు తీరాయనుకునే సమయంలో 4 నెలల క్రితం సతీశ్ అనారోగ్యానికి గురయ్యాడు. హనుమకొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించగా.. కాలేయ సంబంధిత ప్రాంక్రియాస్ వ్యాధి బారిన పడినట్లు వైద్యులు నిర్ధారించారు. తప్పనిసరిగా ఆపరేషన్ చేయాలని, దానికి లక్షల్లో ఖర్చు ఉంటుందని వైద్యులు తెలపడంతోపేద కుటుంబం ఏం చేయాలో పాలుపోక కన్నీటి పర్యంతమైంది.


సతీశ్‌కు అన్నం తినిపిస్తున్న కుటుంబసభ్యులు

ఇప్పుడతడు ఎముకలగూడు!

క్రమక్రమంగా సతీశ్ కడుపులో గడ్డలు, నీటి బుడగలు ఏర్పడడంతో జీర్ణ వ్యవస్థ దెబ్బతిని ఆహారం తీసుకోవడం కష్టంగా మారింది. దీంతో ద్రవ రూప ఆహారం మాత్రమే తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు నెలల క్రితం బలిష్టంగా ఉన్న సతీశ్ ఆరోగ్యం క్షీణిస్తూ ఎముకల గూడు వలే తయారయ్యాడు. వ్యాధిని నయం చేసేందుకు ఆ పేద కుటుంబం అందినకాడల్లా అప్పులు చేసి వైద్యం చేయించారు. అయినా ఎలాంటి ఫలితం దక్కలేదు. ఇదిలా ఉండగా.. నెలకు రూ.5 వేల వరకు మందులకు ఖర్చవుతున్నాయి. ఓ వైపు పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారంగా మారింది. సతీశ్‌కు ఆపరేషన్ చేయిస్తే తిరిగి మామూలు స్థితికి చేరుకునే అవకాశం ఉంది. శస్త్ర చికిత్సకు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుండడంతో దిక్కు తోచని స్థితిలో ఆ పేద కుటుంబం దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. దాతలు స్పందించి పేద బిడ్డ ప్రాణాలు కాపాడాలని దీనంగా వేడుకుంటున్నారు.

దాతలు సాయం అందించాల్సిన ఫోన్, బ్యాంకు అకౌంట్ వివరాలు:
97016 84377 (ఫోన్ పే లేదా గూగుల్ పే)పాలకుర్తి
ఎస్‌బీఐ అకౌంట్ నంబర్: **2043 3814 533**, ఐఎఫ్ఎస్‌సీ : **ఎస్‌బీఐఎన్ 0014240**

ప్రాణం తీసేందుకు పన్నాగం..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

కన్నాయిగూడెం : మూత్రవిసర్జనకు బయటికొచ్చిన ఓ వ్యక్తి ప్రాణం తీసేందుకు పథకం ప్రకారం అతడిపై విద్యుత్ వైర్లు వేయగా షాక్ తగలడంతో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని గంగాగూడెంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానిక ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాగూడేనికి చెందిన కావిరి రవీందర్ వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే కుటుంబంతో సహా ఫిబ్రవరి 29వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. అర్ధరాత్రి మూత్రం వస్తుందని బయటికి వచ్చాడు. కాగా ఇదే అదనుగా అదే గ్రామానికి చెందిన కావిరి ప్రమోద్ ముందస్తు పథకం ప్రకారం ప్రత్యేకంగా విద్యుత్ తీగను తగిలించిన ప్లాస్టిక్ పైప్ సాయంతో గుమ్మం ఎదుట కాపు కాస్తున్నాడు. తలుపు తీసి బయటికి వచ్చిన రవీందర్ పై విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు వేయడంతో రవీందర్ గాయపడి గట్టిగా అరిచాడు. అరుపులు విన్న కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వచ్చి విద్యుదాఘాతానికి గురైన రవీందర్‌ను రక్షించారు. ఇదంతా గమనించిన ప్రమోద్ అక్కడ నుంచి పారిపోయాడని రవీందర్ భార్య దేవి తెలిపారు. పారిపోతున్న ప్రమోద్ వద్ద ఓ కత్తి ఉందని, అది జారిపడిందని తెలిపారు. కొంత కాలం నుంచి ప్రమోద్ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అందులో భాగంగానే తన భర్తపై విద్యుత్ షాక్ ప్రయోగించి ప్రాణాలు తీయాలని పథకం పన్నాడని అన్నారు. గాయపడిన రవీందర్‌ను 108 వాహనంలో ఏటూరునాగారం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.


గాయపడిన రవీందర్